క్లుప్తంగా

కొనసాగుతున్న ధనుర్మాస మహోత్సవాలు



తాడేపల్లి రూరల్ : మంగళగిరి ఆత్మకూరులోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా 15వ పాశురాన్ని సోమవారం భక్తులకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి వివరించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్ఠి వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. హైదరాబాద్, గన్నవరం, విజయవాడ ప్రాంతాలకు చెందిన 250 మంది భక్తులు గోదా దేవికి సారె సమర్పించారని తెలిపారు. జస్టిస్ వి. శ్రీనివాస్, హైకోర్టు చీఫ్ జస్టిస్ లక్ష్మీ ప్రసన్న, స్టేట్ రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎం.వి.రావు తదితరులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి వారి మంగళాశాసనాలు అందుకున్నారని తెలిపారు.

చిన్నారులకు వాక్సినేషన్



ఫిరంగిపురం: మండలంలోని ఫిరంగిపురం పీహెచ్‌సీ, నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో పెంటావాలెంట్ వ్యాక్సిన్ ప్రత్యేక క్యాంప్‌ను సోమవారం నిర్వహించినట్లు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు ఫరీనాబేగం, శ్వేత తెలిపారు.ఈ సందర్భంగావారు మాట్లాడుతూ ఇమ్యూనైజేషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులైన 6నెలల నుంచి 11 నెలల చిన్నారులకు ఈ వ్యాక్సిన్ వేస్తున్నామని తెలిపారు. దీని ద్వారా పలు వ్యాధులు రాకుండా నివారించవచ్చని చెప్పారు.ప్రత్యేక క్యాంప్ అన్ని గ్రామాల్లో మంగళవారం కూడా నిర్వహిస్తామని చెప్పారు. చిన్నారుల పూర్తి వివరాలు హెచ్ఎంఐఎస్, యూ విన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు వివరించారు.

నిర్మాణంలో ఉన్న పశువుల కొట్టం పరిశీలన



పెదపరిమి(తాడికొండ): మండలంలోని పెదపరిమిలో ఉపాధి హామీ పథకం కింద రూ.2 లక్షలతో నిర్మిస్తున్న పశువుల కొట్టాన్ని సోమవారం తుళ్లూరు ఎంపీడీవో కానూరి శిల్ప పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుతో మాట్లాడారు. పథకం ప్రయోజనాన్ని తెలియజేశారు. క్రమంగా వినియోగించుకోవడం ద్వారా లాభాలు ఆర్జించాలని సూచించారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అందజేస్తారని చెప్పారు.

జనసేన పతనం ఖాయం

మంగళగిరి: పార్టీలు మారే గంజి చిరంజీవిని చేర్చుకోవడం వల్ల జనసేన పార్టీ పతనం ఖాయమని ఆ పార్టీ నాయకుడు కాపరౌతు సుందరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వలస వచ్చే పార్టీ నాయకులను చేర్చుకుని పార్టీని నమ్ముకున్న నాయకులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పార్టీ అధినాయకత్వం పని చేసే నాయకులను గుర్తించాలని ఆయన కోరారు.

ఏఎస్ఐపై యువకుడి దురుసు ప్రవర్తన

తాడికొండ: తుళ్లూరు మండలం వెంకటపాలెంలో వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో ఐడెంటిటీ అడిగినందుకు ఏఎస్ఐ ఏసురత్నంపై యువకుడు దురుసుగా ప్రవర్తించాడు. ఈ ఘటనలో ఎదురుతిరిగి ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో వెంకటపాలేనికి చెందిన షేక్ ఐఫా అనే యువకుడుపై ఏఎస్ఐ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

బండారుపల్లిలో సచివాలయ ఉద్యోగిని అదృశ్యం

తాడికొండ: సచివాలయ ఉద్యోగిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె. వాసు తెలిపారు. వివరాల ప్రకారం.. బండారుపల్లి గ్రామ సచివాలయంలో ఉద్యోగినిగా దివ్య అనే వివాహిత పని చేస్తోంది. ఈ నెల 29వ తేదీ విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తున్నట్లు తల్లికి సమాచారం ఇచ్చిన అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. తల్లి, భర్త, బంధువులు ఆమె ఆచూకీపై వాకబు చేసినా ఫలితం లేకపోయింది. 30వ తేదీ సాయంత్రం మహిళ తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ జీత్యా నాయక్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

న్యూ ఇయర్ .. సైబర్ సైరన్ !

- కొత్తపుంతలు తొక్కుతున్న సైబర్ మోసాలు
- ఒక్క క్లిక్‌తో బ్యాంక్ ఖాతాలు ఖాళీ
- ఈ రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



న్యూ ఇయర్ కోసం కొత్తగా వస్తున్న మెసేజ్‌లు

తాడేపల్లి రూరల్: మోసానికి కాదేదీ అనర్హం అనే చందంగా మారిపోయింది ప్రస్తుత పరిస్థితి. న్యూ ఇయర్ వేడుకలను సైతం సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలచుకుంటూ... జనాల చెవిలో పూలు పెట్టేందుకు సిద్ధమైపోయారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఆఫ్షలు, మిత్రులు, శ్రేయోభిలాషులు పంపించే శుభాకాంక్షలు, వివిధ షాపింగ్ ప్లాట్‌ఫారమ్‌లు ప్రకటించే ఆఫర్లను మోసాలకు మార్గాలుగా మార్చుకుంటున్నారు. కొన్ని బోగస్ లింక్‌లను పంపి కుచ్చుటోపీ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజలు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా నష్టపోయే ప్రమాదం ఉంది.

సరికొత్త మోసాలకు సిద్ధం

నూతన సంవత్సర వేళ సైబర్ మోసగాళ్లు సరికొత్త మోసాలకు సిద్ధమయ్యారు. జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 50కి పైగా సైబర్ కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ అంచనాలకు అందని, బయటకు చెప్పుకోలేని సైబర్ మోసాలు లేకపోలేదు. కొత్త సంవత్సరం శుభాకాంక్షల పేరిట మొబైల్ ఫోన్‌లకు ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌ల ద్వారా సందేశాల లింకులు సైబర్ కేటుగాళ్లు పంపిస్తున్నారు. గుర్తు తెలియని నంబర్ల ద్వారా వచ్చే ఈ లింక్‌లను ఏ మాత్రం క్లిక్ చేసినా మీ బ్యాంక్ ఖాతాలోని నగదును క్షణాల్లో మోసగాళ్లు మాయం చేస్తారు. ఈ నేపథ్యంలో ఈ రెండు రోజులు ప్రజలు మొబైల్ మెసేజ్‌ల వాడకం విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఏపీకే ఫైల్స్‌పై జాగ్రత్త అవసరం

ఏపీకే (యాండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్) ఫైల్స్ రూపంలో మెసేజ్‌లు పంపిస్తారు. పొరపాటున దానిపై క్లిక్ చేస్తే మన ఫోన్‌లోని సమాచారం అంతా నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఫొటోలు, కాంటాక్ట్ వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు అన్నీ కేటుగాళ్లు దోచేస్తారు. అందుకే నూతన సంవత్సర సందేశాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

నిశితంగా పరిశీలించాల్సిందే !

రకరకాల గిఫ్ట్ ఓచర్లు, గ్రీటింగ్స్, ట్రావెల్, గాడ్జెట్‌పై ఇచ్చే డిస్కౌంట్‌లను ఒకటికి నాలుగు సార్లు నమ్మదగినవా.. కాదా? అని పరిశీలించుకోవడం అవసరం. వాటి రివ్యూలు చూస్తూ వెరిఫైడ్, అథంటిక్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆఫర్లను తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాలి.

ఇలా మస్కా కొడతారు...

రెండు రోజుల్లో కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. డిసెంబర్ 31 అర్ధరాత్రి నుంచి విషెష్ హంగామా మొదలవుతుంది. బంధుమిత్రులకు విషెస్ చెప్పేందుకు ప్రతి ఒక్కరూ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు వినూత్నంగా ఆలోచిస్తూ మొబైల్‌లో వచ్చే రకరకాల చిత్రాలు, సందేశాలను తమ పేర్ల సహా తయారు చేసుకుని పంపుతారు. అయితే, ఈ అవకాశాన్ని సైబర్ కేటుగాళ్లు వినియోగించుకునే వ్యూహరచన చేశారు. మీకు నచ్చే విధంగా మీ పేరుతో గ్రీటింగ్ సందేశాలను పంపుకోవచ్చని.. మీరు చేయాల్సిందల్లా ఈ క్రింది లింక్‌ను క్లిక్‌చేసి వివరాలు నమోదు చేస్తే మిగతాదంతా మేము చూసుకుంటామని మస్కా కొడతారు. మన మొబైల్‌లోని టెలిగ్రామ్, వాట్సాప్ యాప్‌లకు ఫైల్స్ రూపంలో పంపుతారు. పొరపాటున ఆ లింక్‌ను క్లిక్ చేస్తే అంతే సంగతులు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే ఫైల్స్‌ను ఎట్టిపరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు
- ఫోన్‌లోని సెట్టింగ్‌లో ఇన్‌స్టాల్ ఫ్రమ్ అన్‌నోన్ సోర్సెస్ అనే ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవాలి. ఇలా చేస్తే మనకు తెలియకుండా యాప్స్ ఇన్‌స్టాల్ కాకుండా ఉంటాయి.
- మొబైల్ సెట్టింగ్‌లో ఫోన్ నంబర్లను యాక్సెస్ చేసే అనుమతి ఇవ్వరాదు.
- ఈ మెయిల్స్, టెక్స్ట్, ఇతర సోషల్ మీడియాల యాప్‌ల ద్వారా నకిలీ లింక్‌లను గుర్తించాలి. వాటిపై ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయరాదు.
- మన మొబైల్, లేదా ల్యాప్‌టాప్, కంప్యూటర్లలో ఉండే ఆపరేటింగ్ సిస్టమ్ యాంటీ వైరస్ ప్రోగ్రామ్, అధికారక యాప్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. ఎందుకంటే సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా సంబంధిత సంస్థలు ఎప్పటికప్పుడు తమ వ్యవస్థలో మార్పులు చేస్తుంటాయి.

క్లిక్ చేయవద్దు



అపరిచిత వ్యక్తులు పంపించే ఏపీకే ఫైల్స్, మెసేజ్‌లపై ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ మోసగాళ్లు దుర్వినియోగం చేస్తారు. విషెస్ చెప్పాలనుకునే వారు ఫోన్ ద్వారా మాట కలపడం లేదా సందేశాన్ని పంపండి. వీలైతే వ్యక్తిగతంగా కలుసుకోవడం మంచిది. నూతన సంవత్సరాన్ని అందరూ ఆనందంగా జరుపుకోవాలి. సైబర్ వలలో చిక్కకుండా అప్రమత్తంగా ఉండండి.

– కళ్యాణ్ రాజు, తాడేపల్లి సీఐ

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన అవసరమని వైద్యురాలు ఫరీనా బేగం అన్నారు. మండలంలోని గుండాలపాడులో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. 87మందికి షుగర్, బీపీ, థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఫరీనా బేగం సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార పదార్థాల గురించి వివరించారు. శీతాకాలంలో జలుబు, దగ్గుతోకూడిన జ్వరాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. గోరు వెచ్చని నీరు తీసుకోవాలని, వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, లేకపోతే దోమలు వృద్ధి చెంది రోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఏఎన్ఎం దుర్గా , ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారతం నుంచి జీవిత పాఠాలు నేర్చుకోవాలి



యాప్‌ను ఆవిష్కరిస్తున్న ప్రవచనకర్త వెంకటేశ్వరరావు, వీసీ పార్థసారథివర్మ

తాడేపల్లిరూరల్ : మహాభారతం నుంచి యువత జీవిత పాఠాలు నేర్చుకోవాలని ప్రముఖ ప్రవచనకర్త మంచికంటి వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో లిపి డాట్ గేమ్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటి యువతీ, యువకులు మహాభారతం చదవాలని సూచించారు. లిపి డాట్ గేమ్ మన భారతీయత– మన మహాభారతం అనే నినాదంతో 2025లో తెలుగు వారందరికీ ఆడియోల రూపంలో మహాభారతాన్ని అందుబాటులోకి తీసుకు వస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిగా ఉండాలన్నారు. అర్జునుడి జీవితం ద్వారా తెలుసుకోవచ్చని, జీవితంలో నేర్చుకోవడం నిలిపివేస్తే నష్టపోతారని కర్ణుడి జీవితం తెలియజేస్తుందని విద్యార్థులకు వివరించారు. కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి. పార్థసారథివర్మ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు టెక్నాలజీని జోడించి సమాజానికి అందించడం అభినందనీయమని తెలిపారు. లిపి డాట్ గేమ్ యాప్ డైరెక్టర్ చాగంటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ యాప్ ద్వారా మాతృభాషపై పట్టు సాధించవచ్చని తెలిపారు. యాప్ సీఈఓ సమత మాట్లాడుతూ అందరూ లిపి డాట్ గేమ్ యాప్‌ను మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ ఇన్‌చార్జి డీన్ కెఆర్ఎస్ ప్రసాద్, సాక్ డైరెక్టర్ పి. సాయి విజయ్, ఎన్. లక్ష్మీఅపర్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి బాల ఏసు దేవాలయం తిరునాళ్ల



విద్యుత్ వెలుగులతో బాలయేసు నామకరణ దేవాలయం

మేడికొండూరు: మహిమాన్విత ఏసు నామకరణ దేవాలయం తిరునాళ్లకు అంగరంగ వైభవంగా ముస్తాబైంది. సిరిపురంలోని ఏసు నామకరణ దేవాలయాన్ని కమిటీ విద్యుత్ వెలుగులతో అలంకరించటమే కాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఏటా 31, ఒకటవ తేదీలలో జరిగే ఈతిరునాళ్లను చూడటానికి భక్తులు వేల సంఖ్యలో హాజరవుతారు. కులమతాలకు అతీతంగా ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసిన అనంతరం దివ్య పూజాబలిలో పాల్గొని ప్రార్థనలు చేస్తారు. కోర్కెలు తీరటమే కాకుండా సమస్యలు కూడా వెంటనే తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. గతంలో బ్రిటిషు వారు నిర్మించిన ఆలయంతో పాటు 49 సంవత్సారాల క్రితం నిర్మించిన ఆర్‌సీయం చర్చిలో భక్తులు పూజలు చేస్తారు. దీనితో పాటు దగ్గరలో ఉన్న మేరీమాతను కొవ్వొత్తులు సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకొంటారు. ఇక చివరి రోజును తేరు ప్రదర్శనలు ఆకట్టుకొంటాయి. తేరును గ్రామంలో బాణాసంచా మధ్య తిప్పుతూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు.

ఆలయ ప్రాశస్త్యం.

అప్పటి బ్రిటిషు కాలంలో లండన్ విల్‌హిల్ సంస్థకు చెందిన ఫాదర్ వాన్‌డీపెన్ ఆలయ నిర్మాణానికి పూనుకొన్నారు. అత్యంత సుందరంగా తీర్చిదిద్దటమే కాకుండా ఏసు జన్మించిన ఎనిమిదో రోజున ఏసు నామకరణ దేవాలయంగా పేరు పెట్టారు. అప్పటి నుంచి ఆలయంలో భక్తుల రాక పెరుగుతూ వస్తోంది. తమ కోర్కెలు తీర్చే చల్లని దేవాలయం అని భక్తులు ఇప్పటికి దర్శిస్తూ వస్తున్నారు.

యాభైవేల నుంచి లక్షమంది భక్తులు హాజరు

ఏటా బాలయేసును దర్శించు కోవటానికి జిల్లా నలుమూలల నుంచి యాభైవేల నుంచి లక్ష మంది వరకు భక్తులు వస్తుంటారని ప్రస్తుత ఆలయ ఫాదర్ తోమాస్ తెలిపారు. ఆలయంలో దివ్య పూజాబలి, ఇతర కార్యక్రమాలు చూడటానికి జనం కిక్కిరిసి పోతుంటారని చెప్పారు. మహిమాన్విత యేసు నామకరణ దేవాలయం కావటం వల్ల గ్రామంలోని ప్రతి ఒక్కరూ దీన్ని ఒక వేడుకగా భావిస్తారని తెలియజేశారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు హేయం

మేడికొండూరు: అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని జిల్లా కౌలు రైతు సంఘం బైరగాని శ్రీనివాసరావు ఖండించారు. మేడికొండూరు, సిరిపురం గ్రామాల్లో సోమవారం నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్లమెంటులో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మేడికొండూరు శాఖ కార్యదర్శి ఎస్.ఎం. బాషా, అంబేడ్కర్ సేవా సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

- **తాడికొండ:** అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తాడికొండ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. ర్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.
- అంబేడ్కర్‌ను అవమానపరిచి, దేశ ప్రజల మనోభావాలను గాయపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. తుళ్లూరులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట పలువురు నాయకులు నిరసన ప్రదర్శను నిర్వహించారు. సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. రవి, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.
- **తాడేపల్లి రూరల్** : అమిత్‌షా క్షమాపణలు చెప్పి పదవికి రాజీనామా చేయాలని కోరుతూ సోమవారం దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.
- కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేసి అంబేడ్కర్ విగ్రహం వద్ద క్షమాపణలు చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మంగళగిరి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.
- తాడేపల్లిలోని ఎంటీఎంసీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య పాల్గొన్నారు.
- ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరులో జరిగిన కార్యక్రమంలో సీపీఎం గుంటూరు జిల్లా నాయకులు జొన్న శివశంకరరావు పాల్గొన్నారు.
- **ఫిరంగిపురం:** అంబేడ్కర్‌ను కేంద్రమంత్రి అమిత్‌షా దూషించడంపై సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు.

మంత్రి నివాసం ముట్టడికి పిలుపు

సీఎం, మంత్రి నివాసం చుట్టూ భారీ బందోబస్తు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తాడేపల్లి రూరల్: గిరిజన సంక్షేమ గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మె 44వ రోజుకు చేరుకోవడంతో సోమవారం ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నివాసం, ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడి చేయడానికి పిలుపునిచ్చారు. దీంతో ముఖ్యమంత్రి, మంత్రి నివాసాల చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి సీఎం నివాసానికి వెళ్లే అన్ని మార్గాలతో పాటు ఉండవల్లి కొండవీటి వాగు బ్రిడ్జి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కరకట్ట నుంచి రాజధాని ప్రాంతాలకు వెళ్లే ప్రతి వాహనాన్ని విస్తృతంగా తనిఖీ చేశారు. ఆందోళనకారుల ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ ఉన్నతాధికారుల్లో మరింత ఆందోళన పెరిగింది. మరో రెండు గంటలు తనిఖీ నిర్వహించారు. చివరకు మంత్రి లేరని, అందుకే రావడం లేదని తెలియడంతో ఆందోళనకారులు నిరసనను వాయిదా వేసుకున్నట్లు పోలీసులు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు అమరావతి కరకట్ట వెంబడి ఏర్పాటు చేసిన బందోబస్తును సడలించారు.

పిల్లలకు మంచీచెడులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న రామారావు

మంగళగిరి: పిల్లలకు మంచీచెడులపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని ఎస్సీ ఎస్టీ రైట్స్ యాక్ట్స్ చైర్మన్ కారుమంచి రామారావు తెలిపారు. గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ ఆధ్వర్యంలో బాలల హక్కుల ఉల్లంఘనపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ బాలల హక్కులు అనేది కుటుంబం నుంచే ప్రారంభమవుతాయని తెలిపారు. బాలబాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు నేలటూరి నాగమణి, ఇస్రాయిల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదం





పదవీ విరమణ చేసిన శంకరరావు, రెహమాన్ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిరూరల్ : ప్రపంచంలో ఎవరికీ దక్కని గౌరవం ఒక్క ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారికి మాత్రమే దక్కుతుందని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కళ్లం అంజిరెడ్డి జిల్లాపరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుల పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా వెళ్లారు. ఈ సందర్భంగా దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా రాణించి పదవీ విరమణ చేసిన రెహమాన్, వీసం శంకరరావు ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని తెలిపారు. అనంతరం పదవీ విరమణ చేసిన రెహమాన్ దంపతులను, శంకరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

తాడికొండ: నూతన సంవత్సర వేడుకల పేరుతో ప్రజలు అత్యుత్సాహానికి లోనై చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తాడికొండ సీఐ కె. వాసు హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం, అల్లర్లకు పాల్పడటం అనుమతించబడవని, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అర్ధరాత్రి ఆరుబయట వేడుకలు అనుమతించబడవని, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, మరియు 144 అమలులో ఉందన్నారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది బహిరంగ ప్రదేశాలలో గుమికూడవద్దని ఆయన సూచించారు. గుంపుగా చేరి కుకులు కోయడం, రోడ్లపై అల్లర్లు చేయడం నిషేధమని తెలిపారు.

ఆ కట్టడాలు అక్రమమే..కూల్చివేస్తాం!

స.చ. ద్వారా తీసుకున్న దరఖాస్తుతో సీఎం గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేసిన బడేపురం గ్రామస్తులు



టీడీపీ నాయకుడు ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణం

తాడికొండ: తాడికొండ, బడేపురం గ్రామాలలో నిర్మించిన ఆ కట్టడాలు అక్రమమేనని తాడికొండ తహసీల్దార్ సహచట్టం దరఖాస్తు దారుడికి లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారు. బడేపురం గ్రామానికి చెందిన బండ్ల కోటేశ్వరరావు సహచట్టం దరఖాస్తు దారుడు. ఆయన 1264/బిలో 4.18 సెంట్లు జడ్పీ భూమికి రెవెన్యూ రికార్డులలో మార్పు, 1478/2లో 12 సెంట్ల చెరువు పోరంబోకు ఆక్రమించి పక్కా ఇళ్ళ నిర్మాణం , సర్వే నంబర్ 1450లోని 23.48 సెంట్ల కొండ పోరంబోకు భూమిలో రెవెన్యూ రికార్డుల్లో లేకుండా నకిలీ పట్టాలతో ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేయడంపై దరఖాస్తు చేయగా అవి అక్రమమని సమాధానం వచ్చింది. అనంతరం స్థానిక అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతుండటంతో బండ్ల కోటేశ్వరరావుతో పాటు బడేపురం గ్రామానికి చెందిన 15 మంది సీఎం గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలతో తహసీల్దార్ ఎదుట స్టేట్‌మెంట్ నమోదు చేశారు. జెడ్పీ భూమికి సంబంధించి కోర్టులో ఉన్నందున దానిపై చర్యలు తీసుకోవడం తమ పరిధిలో ఉండదని తెలిపారు. చెరువు పోరంబోకు, కొండ పోరంబోకులో ఆక్రమణలను తొలగించేందుకు సంబంధిత పంచాయతీ అధికారులతో నోటీసులు జారీచేసి తొలగిస్తామని స్టేట్‌మెంట్ ద్వారా లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ నమోదు చేయించారు. త్వరలో వాటిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అయితే ఫిర్యాదు చేసిన వ్యక్తి టీడీపీకి చెందిన వారే కావడం, బడేపురంలో కొండ ఆక్రమణ చేసిన వ్యక్తి టీడీపీకి చెందిన వారే కావడం విశేషం. కాగా రెవెన్యూ రికార్డుల్లో లేని అక్రమ కట్టడాన్ని స్వచ్ఛందంగా తొలగించాలని రెవెన్యూ, పంచాయతీ అధికారులు కోరగా ''తాను తొలగించేది లేదని, మీకు చేతనైతే మీరు తొలగించుకోండి ..నేను ఏం చేయాలో నాకు తెలుసు'' అని అధికారుల ఎదుటే సమాధానం చెప్పడం విశేషం. కాగా ఆయా ఆక్రమణాలకు ఇప్పటికే గత పంచాయతీ, విద్యుత్ అధికారులు ఇంటిపన్ను, కరెంటు బిల్లులు మంజరు చేసి ఉండటం మరో విశేషం. రూ. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం వెనుక, రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయకుండా పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయడం వెనుక అధికారుల పాత్ర ఎంత..ఎవరెవరికి ఎంత ముట్టాయి.. అసలు ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ ఆస్తులను కాపాడుతారా ? లేదా? అనే దానిపై గ్రామంలో హాట్ టాపిక్‌గా మారింది.

ఐబీఎం స్కిల్స్ బిల్డ్‌తో నైపుణ్యాభివృద్ధి



మోతడక(తాడికొండ): మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఐబీఎం స్కిల్స్ బిల్డ్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ ఐబీఎం స్కిల్స్ బిల్డ్ కార్యక్రమం విద్యార్థులు, అధ్యాపకుల్లో విలువైన నూతన నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందన్నారు. కెరీర్, అవకాశాలు పెంపొందించుకోవడంలో సహాయ పడుతుందని తెలిపారు. విద్యార్థులందరూ ఐబీఎం కాగ్నిటివ్ తరగతులు పూర్తి చేయడం ద్వారా ఉచిత బ్యాడ్జీలు, సర్టిఫికెట్లు పొందవచ్చని చెప్పారు. ఐనాస్ టెక్నాలజీస్ ప్రతినిధులు హరీష్, నవీన్ మాట్లాడుతూ ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలంటే ఏఐ టెక్నాలజీలో నైపుణ్యం తప్పనిసరని తెలిపారు. కళాశాల డీన్స్ పి. ఫణికుమార్, పి. బాలమురళీకృష్ణ, వి.వి. సుబ్బారావు, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.